క్లుప్తంగా

ఐలమ్మ వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ఏటూరునాగారం: చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని వీరనారి ఐలమ్మ మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్.దళపతి(చలపతి) ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 సెప్టెంబర్ 15న అప్పటి ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. ఆ జీఓ ప్రకారం ఈనెల 10న జయంతి, ఈనెల 26న వర్ధంతిని అధికారికంగా చేపట్టి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, అస్తిత్వాన్ని కాపాడాలని కోరారు.

ఆర్థికసాయం



వాజేడు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెకండ్ ఏఎన్ఎంగా పని చేస్తూ మృతి చెందిన చందా హైమావతి కుటుంబానికి వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆదివారం ఆర్థికసాయం అందించారు. హైమావతి ఆగస్టు 23న అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఆదివారం ఆమె దశదిన కర్మలను నిర్వహించగా ఉన్నతాధికారులు, పేరూరు, వాజేడు వైద్య సిబ్బంది అందరూ కలిసి రూ.30 వేలు ఆమె కుటుంబ సభ్యులకు డాక్టర్ మధుకర్ చేతుల మీదుగా అందజేశారు.

మన్యసీమ పరిరక్షణ డోలుదెబ్బ కమిటీ ఎన్నిక

ఏటూరునాగారం : మన్యసీమ పరిరక్షణ డోలు దెబ్బ మండల మహిళా కమిటీ ఎన్నిక ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఆదివాసీ మహిళా మండల అధ్యక్షురాలు పెనుక నాగమణి, ఉపాధ్యక్షుడు పూనెం నిర్మల, ప్రధాన కార్యదర్శి ఈసం స్వరూప, కోశాధికారి సునితలతో పాటు పలు సభ్యులను ఎన్నుకున్నారు.

ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలి



ఏపీఓను సన్మానిస్తున్న స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యులు

ఏటూరునాగారం : గణపతి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించగా ఏపీఓ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణపతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏపీఓను సన్మానించారు.

పరామర్శ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ గుర్సింగ బాపు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో ఆయనను కాంగ్రెస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు లేతకరి రాజబాపురమ్య, సంతోష్ ఆదివారం పరామర్శించారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

రేగొండ: మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల తిరుపతి తల్లి రాయమల్లమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రహీమ్, పెండెల శంకర్, రాజు, కోటి, తదితరులు ఉన్నారు.

తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా సంపత్

కాజీపేట: తెలంగాణ వడ్డెర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా గండికోట సంపత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కాజీపేట మండలం రాంపురం గ్రామానికి చెందిన సంపత్‌కు హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలయ్య ఆదివారం నియామక పత్రం అందజేశారు.

నిరుపయోగంగా కంపోస్టు షెడ్లు

- తడి, పొడి చెత్త సేకరించని పారిశుద్ధ్య కార్మికులు
- నిర్లక్ష్యం వహిస్తున్న జీపీ సిబ్బంది
- నీరుగారిపోతున్న ప్రభుత్వ లక్ష్యం



నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్

వెంకటాపురం(కె) : చెత్తబండి వచ్చిందంటే తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలంటూ పంచాయతీ అధికారులు నిర్వహించిన ప్రచారం నామమాత్రంగానే మిగిలిపోయింది. మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. సేకరించిన చెత్తను రోడ్డు పక్కన పడేస్తుండటంతో చెత్త నుంచి వచ్చే దుర్గంధం భరించలేక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త సేకరణపై అధికారులకు పట్టింపు లేకపోవటంతో స్వచ్ఛ గ్రామాల ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతుంది.

తడి, పొడి సేకరణ నిల్

విడివిడిగా తడి, పొడి చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం ఇంటింటికీ రెండు బుట్టలను అందజేసింది. మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 18 డంపింగ్ యార్డులు, కంపోస్టు షెడ్లను నిర్మించింది. కానీ ఇప్పటి వరకు డంపింగ్ యార్డులను, కంపోస్టు షెడ్లను పంచాయతీలు ఉపయోగించింది ఏమిలేదు. చెత్తను సేకరించి కంపోస్టు ఎరువును తయారు చేసిన దాఖలాలు కూడా లేవు. కాగా సేకరించిన చెత్తను వాగుల వద్ద, రోడ్ల పక్కన పడేసి నిప్పు పెడుతున్నారు. అధికారులు డంపింగ్ యార్డులను, కంపోస్టు షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన పడేసిన చెత్త

వినియోగంలోకి తేవాలి



ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లను అధికారులు వినియోగంలోకి తీసుకురావాలి. సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు ఎరువులను తయారు చేయాలి. రోడ్డు పక్కన పడేసి నిప్పు పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కట్ల నర్సింహాచారి, బీసీ మర్రిగూడెం

రీ సైక్లింగ్ చేయాలి



గ్రామాల్లో లక్షలు ఖర్చుపెట్టి నిర్మించిన డంపింగ్ యార్డులను వినియోగంలోకి తేవాలి. సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా డంపింగ్ యార్డులో రీ సైక్లింగ్ చేయాలి. గ్రామాల్లో ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి. డంపింగ్ యార్డులను వినియోగంలోకి తేవాలి.

– తంగెళ్లపల్లి ప్రసాద్, వెంకటాపురం

ఎరుకల కులస్తులు ఐక్యం కావాలి



జెండావిష్కరిస్తున్న ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు

- ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రభాకర్

టేకుమట్ల: మనల్ని మనం పాలించుకునేందుకు ఎరుక కులస్తులు ఏకతాటిపై రావాలని ఏకలవ్య ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు వలిగి ప్రభాకర్ అన్నారు. మండలంలోని వెలిశాలలో క్రిమినల్ ట్రైబల్ యాక్ట్‌ని ఎత్తివేసిన రోజు సందర్భంగా ఆదివాసీ ఎరుకల స్వీయ గౌరవ పోరాట జెండాను మండల అధ్యక్షుడు కేతిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు దేవరాయ సాయిలుతో కలిసి ఆదివారం ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎరుకలను అణిచివేస్తున్నారే తప్ప సమాజంలో కనీస మర్యాదను కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలుగా జీవిస్తున్న ఎరుకలను ప్రభుత్వం ఇప్పటి వరకు గుర్తించి ఎకరం భూమి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అందరం కలిసి మనకు వచ్చి హక్కులు, సంక్షేమ పథకాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాదర్ల అశోక్, ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు రేవెల్లి సదయ్య, జిల్లా అధ్యక్షుడు కేతిరి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షులు మానుపాటి సదయ్య, ప్రధాన కార్యదర్శి రేవెల్లి రాజేందర్, మానుపాటి రవి, దుగ్యాల సారయ్య, దుగ్యాల సమ్మయ్య, దుగ్యాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

హన్మకొండ చౌరస్తా: సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో యోగా సాధకులకు నేత్రదానంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా గార్డెన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, రిటైర్డ్ డీఎఫ్‌ఓ పురుషోత్తం మాట్లాడారు. ఒకరి నేత్రదానం ఇద్దరికి చూపునిస్తుందని వివరించారు. ఈ మేరకు నేత్రాలతో పాటు అవయవ దానం పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు, యోగా గురువులు గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

టేకుమట్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ తెలంగాణ కృషి చేస్తుందని ఆ సంఘం నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పీఆర్‌టీయూ తెలంగాణ నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఏ ప్రకటన, జీఓ 317 సమస్యలు, సీపీఎస్ రద్దు, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్, బదిలీలు, అంతర్‌జిల్లా బదిలీలు, స్పౌజ్ బదిలీల వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. అనంతరం జిల్లా కమిటీ వివరాలను వెల్లడించారు. అధ్యక్షుడిగా ఆరె రాకేశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెలిసోజు బుచ్చిరాములు, మహిళా అధ్యక్షురాలిగా వరహాల విజయలక్ష్మీ, గౌరవ అధ్యక్షుడిగా వంగెపెల్లి సతీష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాజేశ్వరాచారి వ్యవహరించారు. అనంతరం ఎన్నికైన కమిటీ సభ్యులను నాయకులు సన్మానించారు.



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు



అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

- అరకొర వసతులతో ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

మొగుళ్లపల్లి: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలోని 26 గ్రామపంచాయతీల పరిధిలో మూడు క్లస్టర్లలో 60 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో కేవలం 12 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా మిగిలిన 48 అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు లేక అరకొర వసతుల మధ్య కొనసాగిస్తున్నారు. ఇందులో సుమారు 18 కేంద్రాలను పాఠశాలల్లో, కమ్యూనిటీ భవనాలల్లో నిర్వహిస్తున్నారు. దీంతో వాటికి ఎలాంటి అద్దె చెల్లించడం లేదు. మిగితా 30 కేంద్రాలను అద్దె గదుల్లో నిర్వహిస్తు ప్రతీ నెలా రూ.800 నుంచి రూ.1000 చొప్పున అద్దె స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారు చెల్లిస్తున్నారు.

అరకొర వసతులు

నిబంధనల ప్రకారం మండల అభివృద్ధి సాధారణ నిధుల నుంచి 15 శాతం నిధులు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు కేటాయించాల్సి ఉంది. అయినా ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదని స్త్రీ,శిశు సంక్షేమ అధికారులు వాపోతున్నారు. ప్రతీ సంవత్సరం జనాభాకు అనుగుణంగా కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు పెరుగుతున్నాయి. అయితే భవనాలు మాత్రం పెరగడంలేదు. దీంతో గర్భిణులు కూర్చునేందుకు హాలు, చిన్నారులు ఆడుకునేందుకు ఆటస్థలం, కిచన్ షెడ్ వంటి కనీస సౌకర్యాలు ఉన్న గదులు దొరకడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు మంజూరైయ్యే పౌష్టికాహార సరుకుల నిల్వకు భద్రత ఉండడంలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు. ప్రభుత్వాల నుంచి అరకొరగా నిధులు మంజూరవుతున్నాయని స్థానిక ప్రజాప్రతినిధులు మాత్రం వాటిని అంగన్‌వాడీ భవనాలకు కేటాయించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామాల్లో కుల సంఘాల భవనాలకు రూ.లక్షలాది నిధులు కేటాయిస్తున్న పాలకులు అన్ని వర్గాల చిన్నారులు చదువుకునే అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధన్యం ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

రామప్పలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నంది విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు

వెంకటాపురం(ఎం) : మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని శాయంపేట ప్రభుత్వ పాఠశాలలో 1990–91లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సందర్శించారు. రామలింగేశ్వరస్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా రామప్ప శిల్పాకళాసంపద అద్భుతంగా ఉందని వారు కొనియాడారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో పోటోలు దిగారు. ఒకరినొకరూ ఆప్యాయంగా పలకరించుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



వెంకటాపురం(కె) : దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

వెంకటాపురం(కె) : స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మోదీపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రామెళ్ల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీతో పాటు ఆయన తల్లిపై బిహార్‌లో రాహుల్‌గాంధీ అనుచిత వాఖ్యలు చేయటం సిగ్గుచేటు అన్నారు. అధికార దాహం కోసం మతిభ్రమించి మాట్లాతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు నోముల శ్రీకిషన్, జల్లిగంపల లక్ష్మీపతి, అంకాల దుర్గా, చిట్టెం ఈశ్వరావు, కోగిల శ్రీను, రాజు, నరేందర్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

టేకుమట్ల/చిట్యాల: ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో ఆదివారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ మేరకు టేకుమట్ల, చిట్యాల మండల కేంద్రాల్లో బీజేపీ మండల అధ్యక్షులు గుర్రపు నాగరాజు, బుర్ర వెంకటేష్ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు కూర సురేందర్‌రెడ్డి, గాజుల అజయ్, బండారి సమ్మయ్య, వెంకటేష్, శివ, మైదం శ్రీకాంత్, రావుల రాకేష్, తీగల జగ్గయ్య, చెక్క నర్సయ్య, గుండ సురేష్, గజనాల రవీందర్, పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై రాహుల్‌గాంధీ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మోరే రవీందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మోరే వేణుగోపాల్ రెడ్డి నేతృత్వంలో బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేని ఆదర్శవంతమైన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ వెంటనే క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు చెవ్వ శేషగిరి, మాజీ జెడ్పీటీసీ కుమ్మరి లచ్చమ్మ సారయ్య, జిల్లా నాయకులు పోతుగంటి సాయిలు, గూడూరు మహిపాల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు భిక్షపతి, పాల్గొన్నారు.

మండపాల వద్ద పూజలు, అన్నదానాలు

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవ మండపం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ములుగు ఎస్సై వెంకటేశ్వర్లు ప్రారంభించగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు వర్ష, వినాయక్, సభ్యులు వినాయక్, వెంకటేష్, భరత్, శ్రావణ్, కిషోర్, శరత్, రాజు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా స్థానిక రామాలయం వద్ద ఐదో రోజు వినాయకునికి రామాలయ చైర్మన్ నరెడ్ల భాస్కర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్య పూజలతో పాటు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు వేణు, మామిడిశెట్టి కోటి,కర్ణాకర్‌రెడ్డి తెలిపారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని పాత మార్కెట్ సెంటర్ శివాలయం టెంపుల్ సమీపంలో, అప్పావారి వీధి, చొక్కాల గ్రామంలోని వినాయక మండపం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మంగపేట: భక్తులు పోటా పోటీగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఉదయం సాయంత్రం భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



వెంకటాపురం(ఎం) : పూజలు నిర్వహిస్తున్న రామాలయం చైర్మన్ దంపతులు, ఉత్సవ కమిటీ సభ్యులు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని బొంద్రాయి, ఆకులవారి ఘణపురం, ఆదర్శకాలనీ వద్ద అన్నదానం నిర్వహించారు. సాయిదుర్గ మండపంలోని వినాయకుడిని ఐదో రోజు కావడంతో నిమజ్జనం చేశారు. మండపాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

కన్నాయిగూడెం: మండలంలో వినాయక మండపాల వద్ద వివిధ పార్టీల నాయకులు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బుట్టాయిగూడెంలోని సునార్కని విజయ్‌కుమార్ ఇంటి వద్ద నర్సింహారావు, ప్రసాద్, రామకృష్ణ ఆధ్వర్యంలో, చింతగూడెంలో యాదవగూడెంలో మాజీ సర్పంచ్ నారాయణ ఏర్పాటు చేశారు.



మంగపేట: చెరుపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం : ఆదర్శకాలనీలో..



ఏటూరునాగారం: ఊరేగింపుగా నిమజ్జనం చేయడానికి వెళ్తున్న భక్తులు



ములుగు రూరల్ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై వెంకటేశ్వర్లు



వెంకటాపురం(కె): అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



కన్నాయిగూడెం : చింతగూడెంలో..

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



మహాసభలో పాల్గొన్న యూనియన్ నాయకులు

భూపాలపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తున్నాయని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సమ్మక్క అన్నారు. ఆదివారం స్థానిక శ్రామిక భవన్‌లో యూనియన్ నాలుగో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మక్క మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌కు సంబంధం లేని బీఎల్‌ఓ తదితర అదనపు పనులను రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐసీడీఎస్‌ను రక్షించుకోవాలంటే పోరాటం తప్ప మరోమార్గం లేదని తెలిపారు. అదనపు పనులు రద్దు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు.